జడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్

ఖలీల్‌వాడి, జూలై 5 : జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ జిల్లా పరిషత్‌కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. జడ్పీ సీఈవో ఉష, పంచాయతీరాజ్ అధికారి శంకర్, ఇతర అధికారులు కలెక్టర్‌కు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'కాసర్ల'కు అంతర్జాతీయ బహుమతి

సుభాష్‌నగర్, జూలై 5 : జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ కవి కాసర్ల నరేశ్‌రావు అంతర్జాతీయ బహుమతికి ఎంపికైనట్లు తెలంగాణ గాయత్రి ధార్మిక సాహితీ సేవా సంస్థ కార్యదర్శి అరుణ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెనడా దేశం ప్రచురించే అంతర్జాతీయ పత్రిక 'తెలుగు తల్లి' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచస్థాయి కవితా పోటీల్లో కాసర్ల రచించిన 'ముసలి గది' కవిత మొదటి ఐదు స్థానాల్లో బహుమతికి ఎంపికైంది. కాసర్లను ఇందూరు కవులు అభినందించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి క్రీడాకారులు

సిరికొండ, జూలై 5 : మండలంలోని తూంపల్లికి చెందిన క్రీడాకారులు అక్షయ, రాజశ్రీ, శ్రీజ, మనోజ్, నిఖిల్ జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 23న గచ్చిబౌలిలో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. క్రీడాకారులను వీడీసీ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వినాయక్‌నగర్, జూలై 5 : జిల్లాకేంద్రలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. సీతారాంనగర్ కాలనీలో ఉండే వెంకటేశ్వర్లు తన భార్యతో కలిసి కొన్ని రోజుల క్రితం అమెరికాలోని తమ కూతురు వద్దకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. బీరువాతో పాటు ఇంట్లోని వస్తువులను చిందవందరగా పడేశారు. శుక్రవారం ఉదయం చోరీ జరిగినట్లు గుర్తించిన కాలనీవాసులు ఐదో టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆధారాలు సేకరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

హోటళ్లు, మాల్స్‌లో తనిఖీలు

- పలు వ్యాపార, వాణిజ్య సంస్థలకు నోటీసులు

ఖలీల్‌వాడి, జూలై 5 : జిల్లాకేంద్రంలోని పలు వ్యాపార, వాణిజ్య సంస్థల్లో మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, మున్సిపల్, శానిటేషన్, రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పలు సూపర్‌మాల్స్, స్వీట్ హోమ్స్ యజమానులు నిబంధనలు ఉల్లంఘించడంతో జరిమానా విధించారు. ఎంహెచ్‌వో సాజిద్ అలీ, రెవెన్యూ అధికారి నరేందర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

ధర్పల్లి, జూలై 5 : మండలంలోని దుబ్బాకలో గ్రామస్తుల విరాళాలు, వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, లౌడ్ స్పీకర్లను నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై విక్రమ్, సిరికొండ ఎస్సై రమేశ్, మాజీ ఎంపీటీసీ పెండ గంగాధర్, గోవర్ధన్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి రూ. లక్ష విరాళం

కోటగిరి, జూలై 5 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ శుక్రవారం రూ. లక్ష విరాళం అందజేశారు. కలశాల ఏర్పాటు కోసం లక్ష రూపాయలు అందజేసినట్లు దాత తెలిపారు. కార్యక్రమంలో ఆలయ స్థల దాత పోల విఠల్‌రావు గుప్తా, ఇశాంత్‌గుప్తా, బర్ల సత్యనారాయణ, హౌగీరావుపటేల్, కూచి సిద్ధు, నజీర్ పాల్గొన్నారు.

విజయ్ పాఠశాలలో క్రీడోత్సవాలు ప్రారంభం

క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఏసీపీ రాజా వెంకటరెడ్డి

ఖలీల్‌వాడి, జూలై 5 : జిల్లాకేంద్రంలోని విజయ్ హైస్కూల్‌లో 27వ అంతర్గత క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజావెంకటరెడ్డి హాజరై, క్రీడాజ్యోతిని వెలిగించారు. విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి, గౌరవ వందనం సమర్పించారు. ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటలపై మక్కువ పెంచుకోవాలని, ఉన్నత లక్ష్యం, అంకిత భావం, కష్టపడేతత్వం అలవర్చుకోవాలని సూచించారు. హ్యాండ్‌బాల్, పరుగుపందెం, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఫిబ్రవరి వరకు సాయంత్రం వేళల్లో క్రీడలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రభాదేవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, అడమిక్ డైరెక్టర్ వసంత, ప్రిన్సిపాల్ విజేత తదితరులు పాల్గొన్నారు.

'వనమహోత్సవం' లక్ష్యసాధనకు కృషిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సారంగపూర్‌లోని అర్బన్ పార్కులో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, అధికారులు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్/ జూలై 5 : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి, డీఎఫ్‌వో వికాస్‌మీనాతో కలిసి సమీక్షించారు. వర్షాకాలం ప్రారంభమైనందున విరివిగా మొక్కలు నాటే ప్రక్రియను ప్రధానంగా తీసుకోవాలని, నిర్ణీత గడువులోగా మొక్కలు నాటి, జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. వనమహోత్సవం కార్యక్రమానికి సంబంధించి రోజూవారీ నివేదికలు సమర్పించడంతోపాటు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడంతోపాటు ఎమ్మెల్యే, ఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలి

వినాయక్‌నగర్, జూలై 5 : మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సారంగాపూర్‌లోని అర్బన్ పార్క్‌లో వన మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా.. ముఖ్య అతిథిగా ఆయన హాజరై అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. భావితరాల కోసం మొక్కలు నాటాలని, కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వికాస్ మీనా, ఎఫ్‌డీవో సుధాకర్‌రావు, ఎఫ్‌ఆర్వోలు పద్మారావు, రాధిక, జీజీహెచ్ డాక్టర్ ప్రతిమారాజ్, బీట్, సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అమ్మ పేరుమీద ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటాలని పిలుపునిచ్చారు.

వన మహోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

బాల్కొండ/మాక్లూర్/ జక్రాన్‌పల్లి/ ఇందల్వాయి, జూలై 5 : జూలై 5: ఈనెల 8 నుంచి గ్రామాల్లో వన హోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. బాల్కొండలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఏపీవో ఇందిర, కార్యదర్శులు పాల్గొన్నారు. మాక్లూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జైక్రాంతి.. ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తీయించాలని సూచించారు. మరుగుదొడ్లు లేని ఇండ్లను గుర్తించాలని, ప్రభుత్వమే మరుగుదొడ్ల నిర్మాణానికి పూర్తిగా నిధులు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఓంకార్ పాల్గొన్నారు.

ఇందల్వాయి మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రత్యేకాధికారులు శుక్రవారం మొక్కలు నాటారు. మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. మండల పరిషత్ సూపరింటెండెంట్, జక్రాన్‌పల్లి గ్రామ ప్రత్యేకాధికారి బ్రహ్మానందం, కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు. ఇందల్వాయి మండలంలోని లోలంలో వెయ్యి ఈతమొక్కలను ఎక్సైజ్ అధికారులతో కలిసి గౌడ సంఘ సభ్యులు నాటారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రావు, ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ఫయాజ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులుగా అంగన్‌వాడీ సెంటర్ బంద్

- ఇంటికే పరిమితమైన పిల్లలు
- పట్టించుకోని అధికారులు

డిచ్‌పల్లి, జూలై 5 : మండలంలోని సాంపల్లి అంగన్‌వాడీకేంద్రం (93) ఐదురోజులుగా మూసి ఉన్నది. అంగన్‌వాడీ కేంద్రానికి రావాల్సిన చిన్నారులు ఇంటివద్దే ఉంటున్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడంలేదు. అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే ఆయా నాలుగేండ్ల క్రితం మృతిచెందారు. అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న అంతిరెడ్డి శోభ ఏడాది క్రితం ఉద్యోగానికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సాంపల్లి మేళాయి తండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్ కవితకు సాంపల్లి సెంటర్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సెంటర్‌లో వంట చేసేందుకు గ్రామంలోని ఓ మహిళను ఎంపిక చేసి, వీడీసీ సభ్యులు నెలకు రూ. 2 వేలు ఇచ్చి సెంటర్‌ను నడిపిస్తున్నారు. రూ. 2 వేలు తనకు సరిపోవడం లేదని వంట మనిషి విధులకు రావడం లేదు. దీంతో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కవిత చేసిదేమీ లేక ఈనెల ఒకటో తేదీ నుంచి కేంద్రాన్ని బంద్ చేసి, మేళాయి తండా అంగన్‌వాడీలోనే విధులు నిర్వహిస్తున్నది. సాంపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడం, ఎవరూ అద్దెకు ఇవ్వకపోవడంతోనే ఈ సమస్య మొదలైందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత 'నమస్తే తెలంగాణ'తో పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం బంద్ ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని గ్రామస్తులు అంటున్నారు.

సాంపల్లిలో మూసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

బిల్లులు రావట్లేదు.. అల్పాహారం పెట్టలేం

- మండల విద్యాధికారికి మధ్యాహ్నభోజన కార్మికుల వినతి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జక్రాన్‌పల్లి, జూలై 5 : మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా అల్పాహారం, కోడిగుడ్డు, రాగిజావా పెట్టలేమని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి అన్నారు. మండల విద్యాధికారి శ్రీనివాస్‌కు చక్రపాణి ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజన ఏజెన్సీ నిర్వాహకులు శుక్రవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం కోడిగుడ్డు, రాగిజావ పెట్టాలని ఆదేశాలు జారీ చేసిందని, కానీ ఐదునెలలుగా బిల్లులు రాక చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నామని అన్నారు. దుకాణదారుల వద్ద అప్పులు కావడంతో నగలను తాకట్టు పెట్టి డబ్బులు చెల్లించామని తెలిపారు. రాగిజావకు 2 శాతం స్లాబ్ రేటు పెంచాలని, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు స్రవంతి, సభ్యులు లక్ష్మి, గంగామణి, సత్యనారాయణ, రాధ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ

- డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారం రాథోడ్
- పలు గ్రామాల్లో ఫ్రైడే - డ్రైడే

అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

ఖలీల్‌వాడి/ పొతంగల్/ బోధన్/ మోర్తాడ్/ భీమ్‌గల్/ ఏర్గట్ల/ ఆర్మూర్‌టౌన్, జూలై 5 : పరిసరాల శుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నియంత్రణ సాధ్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో వినాయక్‌నగర్ పరిధిలోని గాయత్రీనగర్‌లో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఇంటి వద్ద కూలర్లు, నీటితొట్టీల్లో దోమ లార్వాలను పరిశీలించి అవగాహన కల్పించారు. మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోధకాలు తదితర వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీఎంహెచ్‌వో వెంట పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, పర్యవేక్షకురాలు శాంతకుమారి, ఏఎన్‌ఎం వీణాబాయి, సిబ్బంది ఆశకార్యకర్తలు ఉన్నారు. పొతంగల్ మండలం కల్లూరులో ఏఎన్‌ఎంలు ఫ్రైడే– డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండ్లలోని కుండిల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుజాత, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన్‌లోని రాకాసీపేట్‌లో ఉన్న 12వ వార్డుతో పాటు పలు ప్రాంతాల్లో చేపట్టిన 'ఫ్రైడే– డ్రైడే'ను బోధన్ ఉప వైద్యాధికారిణి విద్యా రాన్‌వాల్‌కర్ పరిశీలించారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో చౌటపల్లి, కమ్మర్‌పల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఫ్రైడే –డ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుప్రియ పరిశీలించి, సూచనలు చేశారు. భీమ్‌గల్ మండలంలోని పల్లికొండలో ఫ్రైడే –డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగింపజేశారు. నర్సరీ, డంపింగ్ యార్డులను పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్యంపై జీపీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఏర్గట్ల మండల వైద్యాధికారిణి ప్రసన్న ప్రియ ఆదేశాల మేరకు మండలంలోని ఎనిమిది గ్రామాల్లో సిబ్బంది ఫ్రైడే – డ్రైడే నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని 23వ వార్డులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ లావణ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ పరిశీలించారు.

ఉన్న భవనం కూల్చారు.. కొత్తది ఎప్పుడు కడతారు?

- గ్రామసభలో ప్రశ్నించిన విద్యార్థుల తల్లిదండ్రులు

కోటగిరి, జూలై 5 : మండలంలోని లింగాపూర్ గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని కూల్చేశారు. కొత్తగా పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా ఎందుకు నిర్మాణం చేపట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రశ్నించారు. లింగాపూర్ జీపీలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. వెంటనే పాఠశాల భవన నిర్మాణ పనులు చేపట్టాలని, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఎంపీడీవో మనోహర్‌రెడ్డి స్పందించి, ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యదర్శి రాజు జీపీ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే చెల్లించాలని కోరారు. సుద్దులం తండాలో నిర్వహించిన గ్రామసభలో సైతం పలు అంశాలపై తీర్మానం చేశారు. కార్యదర్శి ఈశ్వర్ ఆదాయ వ్యవయాలను చదివి వినిపించారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

వినాయక్‌నగర్, జూలై 5 : నగరంలోని వన్‌టౌన్ పరిధికి చెందిన వారు ఫోన్లను పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించి, బాధితులకు శుక్రవారం అప్పగించారు. రూ. 2 లక్షల విలువైన 15 సెల్‌ఫోన్లను బాధితులకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు అందజేశారు. పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

మేకల మందపై చిరుత దాడి

నవీపేట, జూలై 5: మండలంలోని మోకన్‌పల్లి–కమలాపూర్ శివారులోని అటవీ ప్రాంతంలో శుక్రవారం మేకల మందపై చిరుతపులి దాడి చేసింది. నవీపేట మండల కేంద్రానికి చెందిన మేకల యజమాని గాంధీ కథనం మేరకు.. గాంధీ కమలాపూర్ పాత గ్రామంలో రేకుల షెడ్డులో మేకలను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. మేత కోసం మేకల మందను మోకన్‌పల్లి శివారులో గుట్ట ప్రాంతానికి తీసుకెళ్లాడు. మేకల మందపై చిరుత ఒక్కసారిగా దాడి చేయగా.. యజమాని గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయింది. ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుధీర్, సెక్షన్ ఆఫీసర్ జహీర్ ఘటనా స్థలానికి చేరుకొని, మేకపై గాయాన్ని పరిశీలించారు. చిరుత దాడిచేసినట్లు నిర్ధారించారు. దీంతో మోకన్‌పల్లి శివారులోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు, మోకన్‌పల్లి, కమలాపూర్ వాసులు ఆందోళన చెందుతున్నారు.

జాతీయ రహదారిని కందకుర్తికి కలపాలి

రెంజల్, జూలై 5: లాతూర్ జిల్లా సిరూర్ తాజ్‌బంద్ తాలుకా 361వ జాతీయ రహదారిని నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి వరకు పొడగించి, 161వ అంతర్రాష్ట్ర రహదారి మార్గానికి అనుసంధానం చేయాలని నాందెడ్ రాజ్యసభ సభ్యుడు మాధవరావు గొప్‌చాడే కోరారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఆయన గురువారం రాత్రి కలిసి వినతిపత్రం అందించినట్లు కందకుర్తి మాజీ సర్పంచ్, చరిత్ర పరిశోధకుడు యాదవరావు శుక్రవారం తెలిపారు.

కందకుర్తిలో ఇంటింటా వైద్య సిబ్బంది సర్వే

రెంజల్, జూలై 5: మండలంలోని కందకుర్తి గ్రామం ఇందిరమ్మ కాలనీలో ఇటీవల చిన్నారులు అస్వస్థతకు గురికాగా శుక్రవారం గ్రామ కార్యదర్శి సతీశ్‌చంద్ర, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటా తిరిగి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. తాగునీటి నమూనాలు సేకరించారు. పైపులైన్ ద్వారా అక్రమంగా తాగునీటిని వాడితే నీటి సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీకి బకాయి పడిన ఇంటి పన్ను, కుళాయిల పన్నులను చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఉజ్మా, ఏఎన్‌ఎంలు జానకి, రాణి, చిన్నయ్య, రామకృష్ణ, ఆశవర్కరు రాజేశ్వరి, రేఖ, నాజియా పాల్గొన్నారు.

వివరాలను తెలుసుకుంటున్న కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్తలు

అనారోగ్య సమస్యలతో కండక్టర్ ఆత్మహత్య

శ్రీనివాస్ (ఫైల్)

వినాయక్‌నగర్, జూలై 5 : జిల్లాకేంద్రంలో నివాసం ఉంటున్న ఆర్టీసీ కండక్టర్ వీరవత్రి శ్రీనివాస్ (35) ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఆలూరు మండలం కల్లడి గ్రామానికి చెందిన శ్రీనివాస్.. నిజామాబాద్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తించేవాడు. శ్రీనివాస్ కొంతకాలంగా కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్నాడు. ఇటీవల బాన్సువాడ ఏరియాకు డ్యూటీ పడడం, తిరిగి వచ్చే సరికి రాత్రి అవుతుండడంతో స్వగ్రామానికి వెళ్లలేక నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఈ మధ్య నైట్ డ్యూటీతో పాటు కిడ్నీలో నొప్పి తీవ్రం కావడంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబీకులు ఘటనాస్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతుడికి భార్య సుమలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

జీవితంపై విరక్తి చెంది మరొకరు..

బాల్కొండ, జూలై 5: చిట్టాపూర్ గ్రామానికి చెందిన రాడ రాజేశ్వర్ (68) కడుపునొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి శ్రీరాంపూర్ శివారులోని తోటలో మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండి యాసిర్ అరాఫత్ శుక్రవారం తెలిపారు. మృతుడి భార్య గంగనర్సు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ప్రేమలతా సురేందర్

భీమ్‌గల్, జూలై 5: కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతా సురేందర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా మురికి నీరు నిలువకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన స్వర్గ రథాన్ని సభ్యులతో కలిసి చైర్‌పర్సన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గున్నాల భగత్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, మేనేజర్ గౌరీశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

32 బైకులు, 8 ఆటోలు సీజ్

రెంజల్/బాల్కొండ, జూలై 5: రెంజల్ మండల కేంద్రంలోని శుక్రవారం పోలీసులు, రవాణా శాఖ సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని 32 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్ తెలిపారు. బోధన్ రూరల్ సీఐ నరేశ్‌కుమార్, బోధన్ ఆర్టీవో శ్రీనివాస్‌రావు, ఎస్సై ఈ.సాయన్న, సిబ్బంది ఉన్నారు. బాల్కొండతోపాటు వన్నెల్(బి) ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఆర్మూర్ ఎంవీఐ వివేకానంద రెడ్డి, బాల్కొండ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై యసిర్ ఆర్ఫత్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఆర్మూర్‌టౌన్/బోధన్ రూరల్, జూలై5: ఆర్మూర్ మండల పరిషత్ పాలకవర్గం పదవీ కాలం పూర్తికావడంతో మండల ప్రతేకాధికారిగా డీసీవో శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఎంపీడీవో సాయిరాం, ఏపీవో శ్రీనివాస్ సన్మానించారు. బోధన్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు బోధన్ ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మధుకర్ స్వాగతం పలికారు.

బీటీరోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపితే కేసులు

నవీపేట, జూలై 5: బీటీ రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లను నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు పోలీస్ యంత్రాంగానికి సిఫారసు చేస్తామని మండల అభివృద్ధి అధిక